# సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 2 । మే । 2023





## అగ్ని ప్రమాదాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: అగ్ని ప్రమాదాలపై అనుసరించాలి్సన పద్ధతులపై జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ సినిమా హాళ్ల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. హాళ్లలోని పరికరాలను పరిశీలించారు. శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నరేందర్ ఉన్నారు.



## భారీగా యూరియా ఉత్పత్తి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కర్మాగారంలో ఏప్రిల్‌లో 1,18,805.49 టన్నుల యూరియా ఉత్పత్తి చేశామని సీజీఎంఎం సుధీర్ కుమార్ ఝూ తెలిపారు. కర్మాగారంలో పూర్తిసామర్థ్యంతో ఉత్పత్తి సాధించామన్నారు.

గరిష్టం/కనిష్టం

31.0/23.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడి అధికంగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### వందశాతం పరిహారం చెల్లించాల్సిందే..



రైతులతో నీటిని తొలగిస్తున్న మక్కాన్‌సింగ్

రామగుండం/పాలకుర్తి: అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు వందశాతం పరిహారం చెల్లించాల్సిందేనని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ డిమాండ్ చేశారు. సోమవారం అంతర్గాం మండలం ఆకెనపల్లి, సోమనపల్లి, బ్రాహ్మణపల్లి, పొట్యాల, ఎగ్లాస్‌పూర్, పాలకుర్తిలోని పలు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. వ్యవసాయశాఖ నివేదిక మేరకు రైతులను గుర్తించి ఆదుకోవాలన్నారు. తేమతో సంబంధం లేకుండా రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెంద్రు హన్మాన్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ గాదె సుధాకర్, మద్ది తిరుపతి గౌడ్, గుంట బాపు, రాజ్‌కుమార్, మంతెన మహేందర్, గజ్జెల నాగరాజు తదితరులున్నారు.


### ఈనెల 8న కమిషనరేట్ ప్రారంభం



కమిషనరేట్ భవనాన్ని సీపీతో కలిసి పరిశీలిస్తున్న చైర్మన్ కోలేటి దామోదర్

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ నూతన భవనాన్ని ఈనెల 8న ఐటీశాఖ మంత్రి కేటీఆర్, హోంమంత్రి మహమూద్‌అలీ ప్రారంభిస్తారని పోలీస్‌హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. కమిషనరేట్ భవనాన్ని సీపీ రెమా రాజేశ్వరితో కలిసి సోమవారం పరిశీలించారు. 28 ఎకరాల్లో రూ.38.50లక్షల వ్యయంతో అధునాతన హంగులతో కమిషనరేట్ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీస్‌యంత్రాంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు వైభవ్‌గైక్వాడ్, సుధీర్‌కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్, ఏసీపీ ఎడ్ల మహేష్, ఏఆర్ ఏసీపీ సుందర్ రావు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ప్రమోద్ రావు, ప్రసాద్‌రావు, టూటౌన్ సీఐ వేణు గోపాల్, రామగుండం సీఐ చంద్రశేఖర్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ సాయిచంద్, వినయ్, డీఈఈ విశ్వనాథం పాల్గొన్నారు.

### దేశాభివృద్ధిలో కార్మికుల శ్రమ ముఖ్యం




మాట్లాడుతున్న ఈడీ సునిల్‌కుమార్

జ్యోతినగర్: దేశ అభివృద్ధిలో కార్మికుల శ్రమ ముఖ్యమైందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. మే డే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, వ్యక్తిగత జీవితంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీజీఎం ప్రసేంజిత్ పాల్, జనరల్ మేనేజర్లు, అధికారులు, సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి మే డే ఎఫెక్ట్



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిపై మే డే ప్రభావం పడింది. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ దరఖాస్తులు స్వీకరించారు. తొమ్మిది మందే అర్జీలు సమర్పించగా ఏడు రెవెన్యూ సంబంధమైనవి. పెద్దపల్లి మండలం కనగర్తికి చెందిన స్వప్న తనకు రేషన్‌కార్డు మంజూరు చేయించాలని, జిల్లాకేంద్రానికి చెందిన ఫకీర్ మహమ్మద్ తన కుమారుడు అన్సర్‌పాషా వేధింపులకు గురిచేస్తున్నాడని, పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌కు చెందిన కొమిరె పోచయ్య పింఛన్ మంజూరు చేయాలని, పట్టాభూమిలో సిమెంట్‌రోడ్డు నిర్మిస్తున్నారని రామగిరి మండలం పన్నూరుకు చెందిన ఉడుత కుమారస్వామి అర్జీ పెట్టుకున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళా రైతు తాళ్ల లక్ష్మి. పెద్దపల్లి మండలం రాగినేడు. గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో స్థలం లేక నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కురుమపల్లి కేంద్రానికి ఐదు ట్రాక్టర్ ట్రిప్పుల ధాన్యం తీసుకొచ్చింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ట్రిప్పువడ్లు నీటిలో కొట్టుకుపోయాయి. మిగిలిన ధాన్యం తడిసిపోయింది. ఉదయం కేంద్రానికి వచ్చిన లక్ష్మి కొట్టుకుపోయిన వడ్లను చూసి కన్నీటి పర్యంతమైంది.



ఈ చిత్రం ఎలిగేడు మండలకేంద్రానికి చెందిన ఓ రైతుది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి పొలంలో నీరు నిలిచింది. పైగా వరి నేలవాలింది. నీరు నిలిచిపోవడం.. ప్రతిరోజూ వర్షం కురుస్తుండడంతో పొలంలోనే ధాన్యం మొలకవస్తోంది. మరికొన్నిచోట్ల పొలంలోనే ధాన్యం మురిగిపోతోంది. పడిపోయిన పొలాన్ని ఎలా కోయాలో తెలియక రైతు లబోదిబోమంటున్నాడు.



సుల్తానాబాద్ మండలం కనుకులలో నీట మునిగిన వరి ధాన్యం.. నీరు వెళ్లేందుకు కాలువలు తీస్తున్న రైతులు



రామగుండం: నీటిని తొలగిస్తున్న రైతులు

# జాలిలేని వరుణుడు

## కుండపోతగా కురుస్తున్న అకాల వర్షం

- రైతుల ఆరుగాలం కష్టం వర్షం పాలు
- నిలిచిపోతున్న వరి కోతలు
- ధాన్యం ఆరబోయలేక అవస్థలు
- కేంద్రాల్లో మొలకెత్తుతున్న ధాన్యం
- లక్ష్యం 3.49లక్షల టన్నులు
- మిల్లుకు చేరింది 70వేల టన్నులే..
- బోరుమంటున్న అన్నదాతలు



గుంటూరుపల్లి కొనుగోలు కేంద్రం వద్ద పరిస్థితి..



పొలంలో నిలిచిన నీటిలో పడిపోయిన వరి



కాసులపల్లి వద్ద రోడ్డుపై కొట్టుకుపోతున్న ధాన్యం



కాల్వశ్రీరాంపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న విజయ్



మనోహర్‌రెడ్డిని ఘెరావ్ చేసిన రైతులు



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధు

సాక్షి, పెద్దపల్లి/పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్/ఎలిగేడు/జూలపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చేతికొచ్చిన పంట కొట్టుకుపోతుండడంతో అన్నదాతలు విలవిలాడుతున్నారు. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన రాళ్లవాన ఎన్నడూ లేనివిధంగా జిల్లాలోని అన్నదాతలకు కన్నీళ్లను మిగిల్చింది. చేతికొచ్చిన పంటను కోయలేక.. కోత పూర్తిచేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో ఆరబోయలేక.. ఆరబెట్టిన ధాన్యం కాంటాకాక.. ఇబ్బంది పడుతున్నారు.

### 36,596 ఎకరాల్లో పంటనష్టం

మార్చి 16 నుంచి 21వరకు కురిసిన రాళ్లవానతో జిల్లాలో 6,910 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. మార్చి 23న వడగండ్ల వానతో 4,745 ఎకరాల్లో, ఏప్రిల్ 20న ఈదురుగాలుతో 4,631, ఏప్రిల్ 22 నుంచి రాళ్లవానతో 14,620, తాజాగా ఏప్రిల్ 30న రాత్రి కురిసిన కుండపోత వర్షంతో 5,690 ఎకరాల్లో పంటలకు నష్టం చేకూరింది. మొత్తంగా జిల్లాలో ఈ సీజన్‌లో 36,596 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో 24,573 ఎకరాల్లో వరి, 4,004 ఎకరాల్లో మొక్కజొన్న, 3,258 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

### పొలంలోనే రాలిపోయిన గింజలు

ఈదురుగాలులకు వరి నేలవాలి గింజలన్నీ పొలంలోనే రాలిపోయాయి. మరోవైపు కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినా.. అక్కడ తేమ, కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో ధాన్యం కొట్టుకుపోతోంది. జిల్లాలో 300 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. వాటిలో ఆరబోసిన 3.70 లక్షల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. కాంటాలైన 4,800 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయినట్లు అధికారులు అంచనా వేశారు.

### 39.8 మిల్లీమీటర్ల వర్షం

ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. సుల్తానాబాద్‌లో 71.9 మిల్లీమీటర్లు, పెద్దపల్లిలో 61.3, ఎలిగేడులో 54.3, జూలపల్లిలో 53.8, రామగుండంలో 49.1, అంతర్గాంలో 47.4మిల్లీమీటర్ల చొప్పున జిల్లాలో సగటున 39.8 మిల్లీమీటర్లుమీగా నమోదైంది.

### నల్లబడినా కొనాలి..

కాల్వశ్రీరాంపూర్: అకాలవర్షాలకు నల్లబడిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు డిమాండ్ చేశారు. కాంటాలు త్వరగా చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి, రాజమల్లు సేట్, రాణవేన శ్రీనివాస్, రాంచంద్రం, కట్కూరి రాజిరెడ్డి, నవన్, దేవేందర్ పాల్గొన్నారు.

**వర్షపాతం మిల్లీమీటర్లలో..**

| మండలం | వర్షపాతం |
|---|---|
| ధర్మారం | 100 |
| కమాన్‌పూర్ | 85 |
| పెద్దపల్లి | 67 |
| జూలపల్లి | 75 |
| ఎలిగేడు | 76 |
| సుల్తానాబాద్ | 60 |
| కాల్వ శ్రీరాంపూర్ | 66 |
| మంథని | 17 |

### ఫోన్‌లో మాట్లాడిన విజయ్..

ఓదెల: కొలనూర్‌లో ధాన్యాన్ని పరిశీలించి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. మిల్లర్లు ధాన్యంలో కోత విధిస్తున్నారని, ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

### రైతులను ఆదుకోండి..

ధర్మారం: నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ కోరారు. మండలంలోని దొంగతుర్తి, బొట్లవనపర్తి, ఖిలావనపర్తిలో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.పదివేల చొప్పున పరిహారం అందించాలన్నారు.

### సింగిల్‌విండో చైర్మన్ ఘెరావ్

పాలకుర్తి: పాలకుర్తి మండలం కన్నాల సింగిల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డిని కొత్తపల్లి, బసంత్‌నగర్ గ్రామాల రైతులు ఘెరావ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించేందుకు రాగా.. ఘెరావ్ చేసి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మిల్లర్లు సిండికేట్‌గా మారారని, ఈ విషయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

### రైస్‌మిల్లర్లు ఇబ్బంది పెడితే ఉపేక్షించం

మంథని: రైతులు ఆందోళన చెందవద్దని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలోని పోచమ్మవాడ, పవర్‌హౌస్‌కాలనీలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదన్నారు. నిర్వాహకులు మిల్లర్లతో మాట్లాడుతారని తెలిపారు. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఉన్నారు.

### దిక్కుతోచని స్థితిలో పడ్డాం



ధాన్యాన్ని సెంటర్‌లో పోస్తే వరుసవర్షాలతో తడిసి ముద్దవుతోంది. భారీవర్షానికి వరద పూర్తిగా ధాన్యం పైనుంచి వెళ్లడంతో కొట్టుకుపోయాయి. పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదు. రెక్కల కష్టం నీటి పాలైంది.

– గీట్ల పెద్దరంగారెడ్డి, రైతు, కొలనూర్

### ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. తడిసిన ధాన్యాన్ని షరతుల లేకుండా కొనుగోలు చేయాలి. కుప్పగా చేసిన వడ్లు కూడా తడిసి మొలకలు వస్తున్నాయి.

– బొజ్జ మల్లయ్య, రైతు, పెద్దాపూర్

### పంట పోయినట్లే..



అకాలవర్షానికి చేతికొందిన పంట పడిపోయింది. ఆదివారం కురిసిన వర్షానికి నా తొమ్మిదెకరాల్లో పంట నష్టం వాటిల్లింది. సుమారు రూ.ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లింది. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

– మోతుకు శ్రీనివాస్, రైతు ఎల్కలపల్లి

### ధాన్యం మొలక వస్తోంది



కోతలు కోసి కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యం వరస వర్షాలతో మొలకలు వస్తున్నాయి. కేంద్రంలో పోసి 15 రోజులు అవుతోంది. ఇప్పటివరకు కొనుగోలు చేయడం లేదు. – కోట రాజిరెడ్డి, రైతు తొగర్రాయి

### రంగు మారుతోంది



వర్షానికి తడిసిన ధాన్యం రంగు మారుతోంది. 20 రోజుల క్రితం ధాన్యాన్ని అమ్మేందుకు కేంద్రానికి తీసుకొచ్చాం. అప్పుడు కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. ఇప్పుడు ప్రారంభించినా వర్షాలతో కొనుగోలు చేయడం లేదు.

– కర్క అల్యామ్మ, మహిళ రైతు తొగర్రాయి



సుగ్లాంపల్లిలో నీటిని తొలగిస్తున్న రైతులు



కురుమపల్లిలో వరదనీటిలో ఇలా..



మంథని మార్కెట్‌లో కొట్టుకుపోతున్న ధాన్యం



ధర్మారంలో ధాన్యాన్ని చూపుతున్న అడ్లూరి..

# కరాటేతో ఆత్మవిశ్వాసం..!

- రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్
- సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ
- సహకారం అందించిన విశ్వభారతి విద్యాసంస్థ
- శిక్షణలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు




మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్ గౌడ్



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కోల్‌సిటీ/జ్యోతినగర్: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి విద్యాసంస్థల సహకారంతో విద్యార్థులకు కరాటేలో ఉచిత శిక్షణ ఇవ్వడానికి సాక్షి మీడియా శ్రీకారం చుట్టింది. విశ్వభారతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ ప్రారంభించారు. కరాటే ఆత్మరక్షణ, శారీరక, మానసికోల్లాసానికి తోడ్పతుందని, పిల్లలకు బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్‌కు దోహదపడాలని, వారికి నచ్చిన కోర్సుల్లో శిక్షణ అందిస్తే వారికి మంచి జీవితం అందించిన వారం అవుతామన్నారు. విద్యార్థులకు కరాటేలో ఒకినోవా మార్షల్ ఆర్ట్ ఆల్ ఇండియా డిప్యూటీ గ్రాండ్‌మాస్టర్ కరాటే మెలకువలను నేర్పించారు. శిక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులను సీఐతోపాటు విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఒకినోవా మార్షల్ ఆర్ట్ ఆల్ ఇండియా డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కరాటే మొండయ్య, కరాటే సీనియర్ కోచ్ క్రాంతికుమార్ సాక్షి పాత్రికేయులు కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ సంతోషం



కరాటేలో ఉచితంగా శిక్షణ అందించడం సంతోషంగా ఉంది. మూడురోజుల పాటు నిర్వహించే ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కరాటేలో ఉత్తమంగా రాణించాలి. విద్యార్థుల భవిష్యత్‌కు కరాటే దోహదపడుతుంది. – బందారపు యాదగిరిగౌడ్, విశ్వభారతి విద్యాసంస్థల, చైర్మన్

### శిక్షణలో పండ్లు పంపిణీ



శిక్షణలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్నాం. ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు శిక్షణ కొనసాగుతుంది. ప్రావీణ్యం ఉన్న కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నాం. వేసవి సెలవులను ఉపయోగించుకుని కరాటేలో రాణించాలి.

– ప్రవీణ్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్

### కరాటేతోపాటు క్రమశిక్షణ..



విద్యార్థులకు కరాటేతోపాటు క్రమశిక్షణ నేర్పిస్తున్నాం. లైఫ్‌స్కిల్స్, ఏకాగ్రత, పట్టుదల వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. విశ్వభారతి హైస్కూల్‌లో సాక్షి మీడియా ద్వారా కరాటే శిక్షణ అందించడం సంతోషంగా ఉంది.

– తిరుపతిగౌడ్, విశ్వభారతి స్కూల్ హెచ్‌ఎం

### కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్

పెద్దపల్లిరూరల్: కార్మిక చట్టాలపై కార్మికులకు అవగాహన ఉండాలని పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రైల్వేహమాలీ కార్యాలయంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతికార్మికుడు లేబర్ ఆఫీస్ పోర్టల్ ద్వారా ఈ–శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్మికులు ప్రమాదాలకు గురైతే వెంటనే స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందిస్తే తగు న్యాయం జరుగుతుందన్నారు. బాధితులకు ఉచితంగా న్యాయం చేసేందుకు అవకాశం ఉందన్నారు. హమాలీ సంఘం అధ్యక్షుడు కొంతం శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, సంపత్, జితేందర్‌రెడ్డి, లీగల్ అడ్వయిజర్ ఉప్పు రాజు తదితరులున్నారు.

క్లుప్తంగా

## మంత్రులు సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కడం దుర్మార్గం



డాక్టర్ నగేశ్

ధర్మారం(ధర్మపురి): రాష్ట్ర మంత్రులు ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయాలని, ఆత్మాభిమానాన్ని చంపుకొని సీఎం కాళ్లు మొక్కడం దుర్మార్గమని వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ అన్నారు. ధర్మారంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రులకు స్వేచ్ఛ లేదని తెలిపారు. సచివాలయం సందర్భంగా అమాత్యులు చేసిన సంతకాలే తొలి సంతకాలు అయితే తొమ్మిదిన్నరేళ్లలో చేసినవి చెల్లుబాటు కాలేదా అని ప్రశ్నించారు. వారికి ఇవే చివరి సంతకాలన్నారు. పటిష్టమైన సచివాలయాన్ని వాస్తు పిచ్చిలో పడి, సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా కూల్చివేసి, రూ.600 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. లక్షలాది ఎకరాల్లో పంటలు నష్టపోతే మంత్రులు రైతులను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సతీశ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన శ్రావణ్‌కుమార్

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ధుమ్మిరితోటకు చెందిన శ్రావణ్‌కుమార్(33) అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గీత వృత్తిలో భాగంగా శ్రావణ్‌కుమార్ సోమవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి, కల్లు గీస్తున్నాడు. ఆ సమయంలో మోకు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గీత కార్మికులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు కుటుంబసభ్యులు కరీంగనర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు శ్రావణ్‌కు మెదడులో రక్తం గడ్డ కట్టడంతోపాటు, ముఖానికి, తలకు బలమైన గాయాలయ్యాయని తెలిపారు. వారి సూచనతో బాధిత కుటుంబీకులు అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాతోపాటు వైద్య ఖర్చుల నిమిత్తం బీసీ కార్పొరేషన్ నుంచి ఇచ్చే రూ.15 వేలను వెంటనే అందజేయాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు చీకటి సంతోష్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పల్లెర్ల శారద, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు పూరెల్ల మొండయ్యగౌడ్ కోరారు.

## మంత్రి కొప్పులను కలిసిన మండలి చీఫ్‌విప్



మంత్రితో చీఫ్‌విప్ భానుప్రసాదరావు

పెద్దపల్లిరూరల్: కొత్త సచివాలయంలో సోమవారం రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను రాష్ట్ర శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

# కార్మిక క్షేత్రం.. ఎర్ర జెండాలమయం



కార్మికులకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్



ర్యాలీ తీస్తున్న నాయకులు, కార్మికులు

- ఘనంగా మే డే వేడుకలు
- డప్పుచప్పుళ్ల మధ్య ర్యాలీ చేపట్టిన నాయకులు, కార్మికులు

జ్యోతినగర్(రామగుండం): కార్మిక క్షేత్రం.. ఎర్ర జెండాలమయమైంది. కార్మికులు సోమవారం మే డేను ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ(యంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న, కాంట్రాక్టు కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్‌ల ఆధ్వర్యంలో ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి మేడిపల్లి సెంటర్ వరకు ఎర్ర జెండాలతో డప్పుచప్పుళ్ల మధ్య భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బుచ్చన్న, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి, రవి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

**సీఐటీయూ ఆధ్వర్యంలో...**

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్ర జెండా ఎగురవేశారు. నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో...**

ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఐఎన్టీయూసీ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా జెండాను ఆవిష్కరించారు.

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..**



జెండా ఎగురవేస్తున్న జనక్‌ప్రసాద్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, బుర్ర శంకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

**కార్మికవాడల్లో ఎర్ర జెండా రెపరెపలు**

గోదావరిఖని(రామగుండం): అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మే డేను సోమవారం కార్మికవాడల్లో ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని గనులు, ఓసీపీలు, యూనియన్ల కార్యాలయాల వద్ద ఎర్ర జెండాలు ఎగురవేశారు. స్థానిక జనక్ భవన్‌లో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ జెండా ఎగురవేసి, సంస్థ వ్యాప్తంగా ఉన్న 50 మంది ఉత్తమ కార్మికులను శ్రామికశక్తి అవార్డులతో సన్మానించారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి జెండా ఎగురవేశారు. ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలో పలు జెండాలు ఎగురవేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. హమాలీ సంఘం ఆధ్వర్యంలో, స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు కె.విశ్వనాథ్ ఆధ్వర్యంలో పలు గనులపై ఎర్రజెండాలు ఎగురవేశారు.



జెండా ఆవిష్కరిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

**పెద్దపల్లిలో..**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో సోమవారం మే డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రగతినగర్ కూడలి వద్ద జెండా ఎగురవేశారు. సీఐటీయూ కార్యాలయం వద్ద సంఘం నాయకులు ముత్యంరావు, జ్యోతి తదితరులు ఎర్రజెండాలను ఎగురవేసి, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పలు గ్రామాలు, ప్రధాన కూడళ్లలోనూ ఎర్రజెండాలు రెపరెపలాడాయి. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పురాజు, ఇనుగాల అనంతరెడ్డి తదితరులున్నారు.

**వ్యవసాయ మార్కెట్‌లో...**

వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎమ్మెల్యే దాసరి మే డే వేడుకల్లో పాల్గొని, జెండా ఎగురవేశారు. కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, సెక్రటరీ పృథ్వీరాజ్ తదితరులున్నారు.

**కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి**

గోదావరిఖని(రామగుండం): కార్మికుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా జీడీకే–5 ఓసీపీపై సోమవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎర్రజెండా ఎగురవేశారు. ఎన్నో ఉద్యమాలు చేసి, కార్మిక హక్కులను సాధించుకున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక హక్కులను తుంగలో తొక్కుతోందని ఆరోపించారు. పార్టీలకతీతంగా కార్మిక సంఘాలు ఏకమై, కార్మిక హక్కుల రక్షణకు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కేంద్రం 8 గంటల పనిదినాలకు బదులుగా 12 గంటలకు పెంచాలని కుట్ర చేస్తోందన్నారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, నాయకులు గండ్ర దామోదర్‌రావు, మండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిహారానికి ఆర్థికశాఖ ఆమోదంపై హర్షం



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న స్వామి వివేక్ పటేల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపడంపై మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. సంబంధిత ఫైల్‌పై సంతకం చేసినందుకు సోమవారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావును నూతన సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. బోధనాసుపత్రుల్లో 1,827 స్టాఫ్‌నర్సుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఫైల్‌పై సంతకం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

## కేజీబీవీ ఉద్యోగులకు వేసవి సెలవులివ్వాలి

పెద్దపల్లిరూరల్: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ప్రకటించాలని డీటీపీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంకిషన్‌రావు, సంతోష్‌రెడ్డి కోరారు. మహిళా ఉపాధ్యాయులు పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోగా, ఉద్యోగభద్రతను పట్టించుకోకుండా వేసవి సెలవులు ఇవ్వకపోవడం సరికాదన్నారు.

# సార్లు లేని కార్లకు బిల్లులు..!

- నేడు కౌన్సిల్ ఆమోదానికి బిల్లుల చెల్లింపు అంశం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో అద్దె కార్లు నడవకున్నా.. బిల్లులు మాత్రం చెల్లిస్తున్నారు. లేని అధికారుల పేరున అద్దె కార్లు నడిపిస్తున్నామంటూ బిల్లులు రూపొందించడం గమనార్హం. మున్సిపల్ వాహనాల్లో తిరుగుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నెలనెలా పెట్రోల్ అలవెన్స్ పొందుతున్నారు. మంగళవారం నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో 23 అంశాలతో ఎజెండాను తయారు చేయగా.. అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు కూడా పొందుపరిచారు.

**అద్దెకు 12 వాహనాలు**

బల్దియాలో 12 కార్లను అద్దెకు తీసుకుని వివిధ విభాగాల అధికారులు ఉపయోగిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.33వేల చొప్పున 12 వాహనాలకు రూ.3.96లక్షలు చెల్లిస్తున్నారు. ఈ 12 వాహనాలకు ఏప్రిల్, మే నెలల బిల్లులు రూ.7.92లక్షలు చెల్లించాలని ఏజెండాలో పొందుపరిచారు. జూన్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు 10 నెలల కోసం రూ.39.60లక్షల బిల్లుల ఆమోదానికి ఫైలు పెట్టారు. అయితే విధుల్లో లేని అధికారుల పేరిట కార్లను అద్దెకు తీసుకొని బిల్లులు తయారు చేయడం అనుమానాలకు తావిస్తోంది. ఎజెండాలో పొందుపరిచిన 12 వాహనాలకు కొన్ని శాఖల్లో అధికారులే లేరు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ డిప్యూటేషన్‌పై మరో మున్సిపాలిటీకి వెళ్లి ఆరునెలలు దాటింది. కానీ సిటీ ప్లానర్ పేరున అద్దెకు వాహనం నడుపుతున్నట్లు ఎజెండాలో పొందుపరచారు. ఇంజినీరింగ్ విభాగంలో ఒక్కరే ఈఈ ఉండగా.. ఇద్దరి పేరిట, ఇద్దరు డీఈలకు ముగ్గురి పేరిట బిల్లులు ఎజెండాలో నమోదు చేశారు.

**నెలనెలా పెట్రోల్ అలవెన్స్...**

శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు నెలకు 40 లీటర్ల చొప్పున పెట్రోల్ అలవెన్స్ కేటాయిస్తున్నారు. అయితే వీరంతా బల్దియా వాహనాల్లోనే తిరుగుతుండడం గమనార్హం. బల్దియా బిల్లు చెల్లిస్తున్న వాహనాలను కొందరు పర్సనల్ టూర్లకు ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

## అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో జైలు

ఎలిగేడు(పెద్దపల్లి): అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో ఒకరికి పెద్దపల్లి సబ్‌కోర్టు మేజిస్ట్రేట్ ఎం.అర్జున్ మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 04-03-2022 రోజున ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన సైదుల శంకర్ అదే గ్రామానికి చెందిన యువతిపై అత్యాచారయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో వెంట తెచ్చుకున్న కత్తితో హత్య చేసేందుకు ప్రయత్నించాడు. బాధితురాలి ఎడమ చేతికి కత్తి తగిలి, గాయమైంది. ఇది చూసిన బాధితురాలి తల్లి, సోదరి పరిగెత్తుకువచ్చి, శంకర్‌ను బలవంతంగా బయటకు తోసేశారు. వారి కేకలు విన్న ఇరుగుపొరుగువారు సంఘటన స్థలానికి చేరుకోవడంతో అతను పరారయ్యాడు. మరుసటి రోజు సదరు యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటకృష్ణ కేసు నమోదు చేశారు. శంకర్‌ను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. దర్యాప్తు పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను హాజరుపర్చగా అడిషనల్ పీపీ బి.రమేశ్ బాధితురాలి తరఫున వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో శంకర్‌కు జడ్జి సోమవారం శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ ఎం.సందీప్, కానిస్టేబుల్ వి.శ్రీనివాస్‌లను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీ ఎడ్ల మహేశ్‌లు అభినందించారు.

## గోదావరిఖనివాసికి డాక్టరేట్



కిరణ్మయి

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనికి చెందిన దగ్గుల కిరణ్మయికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వర్సిటీ సైన్స్ కళాశాల జంతుశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ జి.మారుతీరామ్ పర్యవేక్షణలో బీటీ పత్తి రసం పీల్చే పురుగులపై కరీంనగర్ జిల్లాలో చేసిన పరిశోధనలు, సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు కిరణ్మయిని అభినందించారు.

## నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల నిర్ధారణకు ఈనెల 2న మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీఓ శ్రీధర్ కోరారు. కొత్తగా సర్టిఫికెట్ కావాల్సినవారు, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైకల్యం ఉన్నవారు క్యాంపుల్లో పాల్గొనాలని వివరించారు. దృష్టిలోపం ఉన్నవారు 11, మానసికవైకల్యం, బుద్ధిమాంద్యం ఉన్నవారు 17న, వినికిడిలోపం ఉన్నవారు 25న స్లాట్‌కోసం నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. క్యాంపులకు వచ్చేటపుడు రశీదు, వికలాంగత్వ కాపీ, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్ తెచ్చుకోవాలని సూచించారు.

## సీపీని సన్మానించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖని: మే డేను పురస్కరించుకుని సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరిని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఘనంగా సన్మానించారు. సీపీ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

## శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా హన్మాన్‌సింగ్



హన్మాన్‌సింగ్

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఖిలావనపర్తి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఠాకూర్ హన్మాన్‌సింగ్‌ను రెండోసారి నియమిస్తూ దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా జంగిలి లక్ష్మి, కుందేళ్ల మల్లేశం, ముత్యాల ఉమాదేవి, మోతె సునీత, చొప్పరి నర్సయ్య, మంథెన సాయిలు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా గరిమెళ్ల రవికుమార్ నియమితులయ్యారు.

**ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం..**

ఆలయ కమిటీ సభ్యులతో సోమవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి కాంతారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, గ్రామ సర్పంచు సాగంటి తార, ఎంపీటీసీ సభ్యురాలు మోతె సుజాత, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, నాయకులు కొండయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

# ఆర్జీ–3లో 101 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎంలు వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల పరిధిలో ఏప్రిల్ మాసంలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు జీఎంలు తన్నీరు వెంకటేశ్వర్‌రావు, కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఓసీపీ–1లో 2.50 లక్షల టన్నులకు గాను 2.80 లక్షల టన్నులు సాధించి 112 శాతం, ఓసీపీ–2లో 1.90 లక్షల టన్నులకు గాను 1.65 లక్షల టన్నులు సాధించి, 87 శాతంలో నిలిచినట్లు పేర్కొన్నారు. మట్టి తొలగింపులో 45 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 37.5 లక్షలు సాధించి, 88 శాతంలో నిలిచినట్లు తెలిపారు. ఓసీపీ–1 సీహెచ్‌పీ నుంచి 6.85 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని, అడ్రియాల గనిలో 1.38 లక్షల టన్నులకు గాను 0.69 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 52 శాతంలో నిలిచినట్లు చెప్పారు. వర్ష ప్రభావం ఉన్నప్పటికీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన కార్మికులకు, అధికారులకు అభినందనలు తెలిపారు. గత నెలలో రామగిరి మండలంలోని నాగేపల్లిలో మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని, రత్నాపూర్, కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామాల్లో సీసీరోడ్ల పనులు ప్రారంభించామన్నారు. సెంటనరీకాలనీ రాణీ రుద్రమదేవి మైదానంలో బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటు, కమ్యూనిటీహాల్‌లో మరమ్మతు చేయిస్తామని తెలిపారు. కార్మికులు, అధికారులు ఇదే స్ఫూర్తితో పని చేసి, 2023–24 సంవత్సరానికి ఆర్జీ–3 నిర్దేశించిన 55 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని సూచించారు.

# వకీల్‌పల్లి గని ఉద్యోగుల పనితీరు భేష్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీలకు దీటుగా ఏప్రిల్ నెలలో 166 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన వకీల్‌పల్లి ఉద్యోగుల పనితీరు భేష్ అని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెలలో ఆర్జీ–2 ఏరియాలో 7.53 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 7.54 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి వందశాతంలో నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే 49.95 లక్షల టన్నుల క్యూబిక్ మీటర్ల ఓబీ లక్ష్యానికి గాను 48.54 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి, 97 శాతంలో నిలిచినట్లు తెలిపారు. అకాల వర్షాల కారణంగా ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి కొంతమేర అంతరాయం కలిగినప్పటికీ ఏరియాకు కేటాయించిన లక్ష్యాలు సాధించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి, వార్షిక లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలని పేర్కొన్నారు.

# బొగ్గు నిల్వ సామర్థ్యం పెంచుకోవాలి

- సింగరేణి మైనింగ్ అడ్వైజర్ డీఎన్ ప్రసాద్



ప్లానింగ్ పరిశీలిస్తున్న మైనింగ్ అడ్వైజర్ డీఎన్ ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సింగరేణి మైనింగ్ అడ్వైజర్ డీఎన్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన ఆర్జీ–2 ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో గనులకు సంబంధించిన ప్లాన్ పరిశీలించారు. ఓబీ తొలగింపు వివరాలు, అకాల వర్షాల వల్ల వచ్చే నీటి ప్రవాహాన్ని బయటకు పంపించడం, వరద కాలువల పునరుద్ధరణ, వర్షాల వల్ల బొగ్గు రవాణాకు ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడం, వానాకాలంలో బొగ్గు రవాణా చేసేందుకు నిల్వ సామర్థ్యం పెంచుకోవడం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సకాలంలో అందించాలని పేర్కొన్నారు. ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ఓసీపీ–3 గని మేనేజర్ డి.రమేశ్, సర్వే అధికారి కోటేశ్వర్‌రావు, డ్రాగ్‌లైన్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ తదితరులున్నారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1986–87 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారు సోమవారం కాల్వశ్రీరాంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. చిన్ననాటి మిత్రులను ఇన్నేళ్ల తర్వాత చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషంగా గడిపారు. అందరూ కలిసి భోజనం చేశారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్న క్రీడాశాఖ అధికారి తిరుపతిరావు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాల్లో ఈ నెలాఖరు వరకు నిర్వహించే వేసవి క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా శాఖ అధికారి తిరుపతిరావు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్లకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఎంపిక చేసిన గ్రామాలకు చెందిన 16 ఏళ్లలోపు బాలబాలికలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులుగా ఉన్న జిల్లా అధికారులు మాధవి, రంగారెడ్డి, పీఈటీ రవి, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాలికకు తీవ్ర గాయాలు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన అప్సర (13)కు ప్రమాదవశాత్తు కడుపులో గ్లాసు గుచ్చుకొని తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. అప్సర సోమవారం తన సోదరితో కలిసి వైద్యుడి వద్దకు వెళ్లి వస్తుండగా కిందపడింది. అక్కడే ఉన్న గ్లాసు కడుపులో గుచ్చుకుంది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటన వివరాలు తెలిపేందుకు కుటుంబీకులు నిరాకరించారు.